కథ

# స్థానబలం

ఆదోని లలిత

**చెన్నయ్ పాండీ బజారులో శరవేగంగా దూసుకుపోతున్న కారు సర్రుమంటూ ఆగింది. కారు దిగి డోర్ వేశాడు శరత్. అక్కడ తన బాల్య స్నేహితుడు బలరామ్ చెట్టు కింద కూర్చుని వున్నాడు. ప్రక్కనే ఒక పెద్ద హస్తం బొమ్మ వున్న బోర్డు.. తను హస్త సాముద్రికం చెబుతున్నాడనటానికి నిదర్శనంగా. అది చూసిన శరత్ మనసు గతంలోకి పరుగెత్తింది.**

పదేళ్ళ వయసులో తనూ, బలరామ్ తమ పాఠశాల ఆవరణలో చెట్టుకింద కూర్చుని వున్నారు. శరత్ చేతి రేఖలను బలరామ్ పరిశీలిస్తున్నాడు. తనకేమీ తెలియకపోయినా స్నేహితుల హస్త రేఖలను పరీక్షించి ఏదో తోచినది చెప్పడం బలరామ్‌కి సరదా. బలరామ్ శరత్ చేతిని పరీక్షగా చూస్తున్నవాడల్లా–

"ఒరేయ్ శరత్! నీకు గొప్ప యోగముందిరా. భవిష్యత్తులో నీవు తప్పకుండా కార్లో తిరుగుతావు" అన్నాడు.

అందుకు శరత్ "నేను కారులో తిరుగుతానో లేదో కాని, నీవు మాత్రం తప్పకుండా ఏదో చెట్టు కింద కూర్చుని జోతిషం చెప్తుకుంటావు" అన్నాడు. అది నిజంగా ఫలించింది.

తాము ఇంకా కొద్ది రోజులకు కాలేజీలో చేరుతారనగా బలరామ్ వాళ్ళ నాన్నగారికి బదిలీ అయ్యింది. ఇద్దరూ విడిపోక తప్పలేదు. తరువాత కొద్ది రోజులకే బలరామ్ తల్లిదండ్రులు బస్సు ప్రమాదంలో చనిపోయారని, ఏ ఆసరా లేని తను చదువుకు స్వస్తి చెప్పి ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నట్టు బలరామ్ ఉత్తరంలో తెలిపాడు. ఆ తరువాత ఇక బలరామ్ నుంచి ఉత్తరాలు లేవు. తన మకాం చెన్నయ్‌కి మారింది. ఇప్పుడు 15 సంవత్సరాల తర్వాత తను బలరామ్‌ను ఈవిధంగా చూస్తున్నాడు. బలరామ్‌ను ఇన్నేళ్ళ తర్వాత చూసినందుకు సంతోషమూ, ఈ పరిస్థితిలో చూసినందుకు బాధా కలిగాయి శరత్‌కు.

శరత్ కారు డోర్ లాక్ చేసి చిన్నగా బలరామ్ ముందుకు వెళ్ళి చేయి చూపాడు. అతడు అలవాటుగా శరత్ చేతిని తన చేతిలోకి తీసుకుని, తలెత్తి చూసి ఒక్క క్షణం కలా, నిజమా అన్నట్టు ఆశ్చర్యంగా చూశాడు. వయసూ, పరిస్థితులూ తెచ్చిన మార్పు ఇద్దరిలోనూ కనిపిస్తున్నప్పటికీ బలరామ్ కూడా శరత్‌ను గుర్తుపట్ట గలిగాడు. సంతోషంతో ఇద్దరి చేతులు బిగుసుకున్నాయి.

ముందుగా శరత్ తేరుకుని–

"రేయ్ బలరామ్! ముందిక్కడ నుంచి లే! ఇంటికెళ్ళి అన్ని సంగతులు మాట్లాడుకుందాం" అన్నాడు.

ఇద్దరూ కారులో బయలుదేరారు. కొంత సేపటికి చిన్నదయినా, అందమయిన మేడ ఆవరణలోకి కారు వెళ్ళి ఆగింది. శరత్ స్నేహితుడిని లోపలికి ఆప్యాయంగా తీసుకెళ్ళాడు. చక్కని అలంకరణతో మెరిసిపోతున్న హాల్లో మిత్రుడిని కూర్చోబెట్టి–

"జ్యోతీ!" అని పిలిచాడు శరత్. రెండు నిమిషాల తర్వాత ఓ అమ్మాయి బయటికి వచ్చి బలరామ్‌ని చూసి సంకోచంగా గుమ్మం దగ్గరే ఆగిపోయింది.

"బలరామ్! జ్యోతిని గుర్తుపట్టనా?" అని అడిగాడు శరత్. అందుకు లేదన్నట్టుగా తల అడ్డంగా వూపాడు బలరామ్.

"అరేయ్! ఇది మన జయరా!" అని చెప్పాడు శరత్.

బలరామ్ ఆమె వైపు ఆశ్చర్యంగా చూశాడు. తరువాత ఆశ్చర్యం పోయి ఆనందం కలిగింది. తాము దూరమయ్యేనాటికి జయ చిన్నపిల్ల. బొద్దుగా, ముద్దుగా కాళ్ళు కదిపేది. తమాషాగా చేతులు తిప్పేది. అది చూసి బలరామ్–

"శరత్! మన జయ పెద్ద ఆర్టిస్టు అవుతుందిరా" అనేవాడు. అది ఫలించింది. ఇప్పుడు జయ జ్యోతిగా మారి పెద్ద సినిమా తార అయ్యింది.

శరత్ బలరామ్‌ను జ్యోతికి పరిచయం చేశాడు తన బాల్య స్నేహితునిగా. తరువాత స్నేహితుడిని తన గదిలోకి తీసుకెళ్ళాడు. ఇద్దరూ తాము



దూరమయ్యాక జరిగిన సంగతులు చాలాసేపు మాట్లాడుకున్నారు.

మాటల మధ్యలో శరత్ బలరామ్‌ను తనతోనే వుండిపొమ్మన్నాడు. అందుకు బలరామ్ ఏపనీ లేకుండా అలా వుండిపోవడం తనకు ఇష్టం లేదన్నాడు.

"అరేయ్! అనుకోని పరిస్థితుల కారణంగా చదువు మానేశావు. ఇప్పుడు నీవు చేయగలిగే పనేమిటో చెప్పు" అన్నాడు శరత్.

"ఏం చేయగలను? ఏమీ తెలియకపోయినా ఏదో తెలిసినట్టు చేతులు చూసి జోస్యం చెప్పడం తప్ప! ఇలా చెప్పడమూ ఆత్మవంచనే! గత్యంతరం లేక నా మనస్సాక్షికి విరుద్ధంగా బ్రతుకుతున్నాను" అన్నాడు బలరామ్ బాధపడుతూ.

ఆతని మాటలు విని శరత్ ఒక్క నిమిషం ఆలోచిస్తూండి పోయాడు. తరువాత చాలా సంతోషంగా

శపథం చేస్తున్నట్టు–

"బలరామ్! నిన్ను కొద్ది రోజుల్లోనే పెద్ద జ్యోతిషుణ్ణి చేస్తాను. అలా రోడ్డు ప్రక్కన జ్యోతిషం చెప్పడం కాదురా! పెద్ద పెద్ద హోటల్స్‌లోనే ఇకమీదట నీ బస. నీ దగ్గరికి పెద్ద పెద్ద వాళ్ళు జ్యోతిషం చెప్పించుకోవడానికి వచ్చేట్టు చేస్తాను చూడు" అన్నాడు అతని చేతిని పట్టుకుని. ఆ మాటలకు బలరామ్ శరత్ వైపు వింతగా చూశాడు. దానికి సమాధానంగా శరత్–

"ఈరోజుకు భోంచేసి విశ్రాంతి తీసుకుందాం. రేపు అంతా నీకే అర్థమౌతుంది" అన్నాడు.

ఆ రోజు గడిచిపోయింది.

మరునటి రోజు శరత్ తనకు తెలిసిన ఫొటోగ్రాఫరుని పిలిచాడు. బలరామ్ శరత్ చేతిని పట్టుకుని జ్యోతిషం చెబుతున్నట్టు నాలుగు ఫొటోలు తీయించాడు. తరువాత బాగా పరిచయమున్న మరికొందరు నాయకులతోనూ, ఇద్దరు మంత్రులతోనూ అదే విధంగా ఫొటోలు తీయించాడు. నాలుగు రోజుల తర్వాత, నాలుగు ముఖ్యమైన పత్రికల్లో ఫొటోలతో పాటు బలరామ్ విఖ్యాత జ్యోతిషుడన్న ప్రకటనను శరత్ ప్రచురింపజేశాడు. దానితో పాటు బలరామ్ 'హోటల్ శ్రీ'– రూమ్ నెంబర్ 4లో బస చేస్తున్నట్టు, ఉదయం పది గంటల నుంచి 12 గంటల వరకు, సాయంకాలం 5 గంటల నుంచి 8 గంటల వరకు సంప్రదించవచ్చని, అతను అక్కడ నాలుగు రోజుల పాటు వుంటున్నాడనీ ఆ ప్రకటనలో వివరాలున్నాయి. బలరామ్ శరత్ చేస్తున్న ఏర్పాట్లకు కంగారు పడిపోయాడు. శరత్ ధైర్యం చెప్పాడు.

నాలుగు రోజుల్లో బలరామ్‌ను పలువురు వచ్చి సంప్రదించారు. అతడు తనకు తెలిసిన విధంగా, తన అలవాటు పడ్డ ధోరణిలో, వచ్చిన మనిషిని బట్టి తగిన విధంగా చెబుతూ తన కార్యక్రమాన్ని కొనసాగించాడు. డబ్బు కూడా బాగా వసూలయింది.

రెండు రోజులు విశ్రాంతి తీసుకున్నాడు బలరామ్. తరువాత శరత్ బలరామ్‌కు హైదరాబాద్, విజయవాడ, బెంగుళూరు, మైసూరుల్లో కూడా అదే విధమైన ఏర్పాట్లు చేశాడు.



తర్వాత బలరామ్ పలు ముఖ్యమైన పట్టణాలలో బస చేశాడు. మంచి జ్యోతిషునిగా గుర్తింపు దొరికింది. అప్పుడప్పుడు స్నేహితులిద్దరూ ఫోనులో మాట్లాడుకుంటున్నారు. ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా కొనసాగుతున్నాయి. ఇప్పుడు అన్ని ఏర్పాట్లూ బలరామే స్వయంగా చేసుకుంటున్నాడు. అయిదు సంవత్సరాలు గడిచిపోయాయి. శరత్ పనిమీద ముంబయ్ వెళ్ళాడు. అక్కడ హిందీ పేపర్లో రామ్‌జీ గొప్ప జ్యోతిషుడన్న ప్రకటనను చూశాడు. రామ్‌జీ పెద్ద గడ్డం, మీసాలు, బాగా పెరిగిన జుత్తుతో చూడగానే ఒక విధమైన గౌరవం ఏర్పడేట్టు వున్నాడు. ఒక్క క్షణం రామ్‌జీ కళ్ళు శరత్‌కు మాగా పరిచయమున్న కళ్ళలా కన్పించాయి. కాని శరత్ పెద్దగా పట్టించుకోలేదు. జ్యోతిషం మీద పెద్ద నమ్మకం లేకపోయినా శరత్ ఆ రామ్‌జీని చూడాలనుకున్నాడు కొన్ని కారణాల వల్ల.

రామ్‌జీని చూడడానికి శరత్ అతను బస చేసిన హోటల్ 'తాజ్'కు వెళ్ళాడు. రాత్రి ఎనిమిది గంటలకు కాస్త ముందుగా వెళ్ళాడు. ఎనిమిది గంటల తర్వాత సంప్రదింపులుండవు గనుక బహుశా తనే చివరి వాడి ననుకుంటూ రామ్‌జీ గదిలో అడుగు పెట్టాడు శరత్. గదిలో మంచి అగరొత్తుల పరిమళం వస్తోంది. రామ్‌జీకి నమస్కరించి శరత్ పక్కనే కూర్చున్నాడు. శరత్ నమస్కారాన్ని అందుకున్నాడు రామ్‌జీగా మారిన బలరామ్. ప్రక్కన కూర్చున్న శరత్ కళ్ళలోకి కొంటెగా చూస్తూ–

"ఏయ్ శరత్! నాకు నమస్కారం పెడతావేంట్రా!" అన్నాడు . ఆ మాట విన్న తర్వాత శరత్ బలరామ్‌ను వెంటనే గుర్తు పట్టగలిగాడు. ఇద్దరూ సంతోషంగా అలా చూస్తుండిపోయారు ఒకరినొకరు కొద్ది క్షణాలు. తరువాత నవ్వుకున్నారు ఘనస్ఫూర్తిగా. స్నేహితుని భుజం చరుస్తూ శరత్ ఇలా అన్నాడు.

"బలరామ్! ఇప్పుడు చూశావా! నిన్ను పెద్ద జ్యోతిషుణ్ణి చేస్తానన్న నా శపథం నెరవేరింది. ఎవరైనా కెటిల్‌లో టీ పోసుకుని రోడ్డు వెంబడి అమ్ముకుంటే దాని వెల రూపాయి. అదే టీని కెటిల్‌లో కాకుండా చిన్న టీ కొట్టు పెట్టుకుని అమ్ముకుంటే దాని వెల రెండు రూపాయిలు. అదే ఉడిపి హోటల్లో దాని వెల అయిదు రూపాయిలుంటుంది. ఇక ఫైవ్ స్టార్ హోటల్‌లోనైయితే దాని విలువ పది రెట్లు ఎక్కువగా వుంటుంది. అదే విధంగా నీవు ఇదే వేషంలో రోడ్డు పక్కన కూర్చుని జ్యోతిషం చెబితే నీ చేతిలో రాలేవి కేవలం రూపాయి బిళ్ళలు. ఇప్పుడు అదే జ్యోతిషాన్ని ఫైవ్ స్టార్ హోటల్లో చెబుతున్నావు గనుక నీ జ్యోతిషం వెల వందల రూపాయిల్లో వుంది. అందుకేరా –

'తన బలం కంటే స్థాన బలం గొప్ప' అన్నారు. నిజమే కదూ?....